కాసానిని గెలిపించి తీరుతాం

బీసీ వ్యతిరేకి కాంగ్రెస్‌కు బుద్ధి చెపుతాం

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతిని కాంక్షించే బీఆర్ఎస్‌కే మా మద్దతంటున్న బీసీ నేతలు

ఆది నుంచీ కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల వివక్షత చూపుతూ వస్తున్నదని బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికారంలో ఉన్నామన్న అహంకారంతో ఇష్టం వచ్చినట్లుగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతుండడం పట్ల బీసీ నేతలు మండిపడుతున్నారు. బీసీలకు న్యాయం చేయకపోగా.. దమ్ముంటే బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని రెచ్చగొట్టేలా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడడం సమంజసం కాదని నేతలు పేర్కొంటున్నారు. ఇకనైనా బీసీలు మేల్కొనాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా పలువురు నేతలు గుర్తు చేస్తున్నారు. ఈసారి గెలిపించుకోకుంటే.. రానున్న రోజుల్లో ఏ ఎన్నికల్లోనూ బీసీలకు టికెట్ ఇచ్చేందుకు ఏ రాజకీయ పార్టీ ముందుకు రాదని హెచ్చరిస్తున్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతిని కాంక్షించి బీసీ అభ్యర్థికి టికెట్ ఇచ్చిన బీఆర్ఎస్‌కు తమ మద్దతు అని పలువురు నేతలు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీలకతీతంగా అన్ని కుల సంఘాలు ఏకతాటిపైకి వచ్చి కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిస్తున్నారు. బీసీలు తల్చుకుంటే ఏదైనా సాధిస్తారని ఈ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించడం ద్వారా నిరూపించాలన్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ)

బీసీల దమ్మేంటో చూపిస్తాం

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. బడుగులను చులకనగా చూస్తున్న పార్టీ కాంగ్రెస్. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. బీసీల ఐక్యతను చాటుతాం. జనాభాలో మెజార్టీగా ఉన్న బీసీల సత్తా చూపెడతాం.

– నర్సింహులు, పర్వతాపూర్, తాండూరు

బీసీ కులాల ఐక్యత చాటుతాం

ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ గెలుపునకు కృషిచేస్తాం. ఉమ్మడి రాష్ట్రంలోనే జ్ఞానేశ్వర్ బీసీ కులాలను ఏకం చేసి రాజకీయ చైతన్యం కల్పించారు. బీఆర్ఎస్ అగ్ర కులాల నాయకులకు టికెట్ ఇవ్వకుండా ఓ బీసీ నాయకుడికి టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉన్నది. కాసానిని అధిక మెజార్టీతో గెలిపించి బీసీ కులాల ఐక్యత చాటుతాం.

– ఎం.రాములు, పూడూరు మండలం

కాసాని గెలుపే ధ్యేయం

చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని ముదిరాజ్ బిడ్డ కాసానికి కేటాయించడం హర్షణీయం. గతంలో ఎంపీగా గెలిచిన వ్యక్తి ఆస్తులను కాపాడుకునేందుకు కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యాడు. కానీ కాసాని కేవలం బీసీల ఐక్యత కోసం తన జీవితాంతం పోరాటం చేస్తూనే ఉన్నారు. బీసీ బిడ్డ కాసానిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం.

– శివరామ్, జినుగుర్తి, తాండూరు

కాసానికి టికెట్ ఇవ్వడం అభినందనీయం

కాసాని గతంలో ఉమ్మడి జిల్లా అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారు. అలాంటివారు పార్లమెంట్‌లోకి వెళ్తే నిరుపేదల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. బీసీ నాయకుడికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వడం అభినందనీయం. అధికారం కోసం పార్టీలు మారినవారికి సరైన బుద్ధి చెప్పాలి.

– హన్మంత్, కడ్మూర్, పూడూరు మండలం

బీసీలంతా ఒక్కటవుతారు

బీసీలంగా ఏకతాటి పైకి వచ్చి కాసానిని అధిక మెజార్టీతో గెలిపించుకుంటాం. కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొన్ని రోజులకే ఆ పార్టీ నేతలు ఆహంకార ధోరణితో విర్రవీగుతున్నారు. బీసీలకు బీఆర్ఎస్ అధినేత పెద్దపీట వేశారు. జనాభా లెక్కన చూసిన కూడా బీసీలమే అధిక శాతం ఉన్నాం. తప్పకుండా జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం.

– బీర్బల్, మైతాబ్‌ఖాన్‌గూడ, నవాబుపేట మండలం

మన ఓట్లు మన నాయకుడికే వేసుకుందాం

ఎన్నికల్లో కాసాని గెలుపొందడం ఖాయం. గతంలో చేవెళ్ల నుంచి ఇద్దరు నాయకులు ఎంపీగా గెలుపొంది తమ సొంత ప్రయోజనాల కోసం ఇతర పార్టీలోకి వెళ్లారు. బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి మన ఓట్లు మన నాయకుడికే వేసుకుందాం. ఎంపీగా జ్ఞానేశ్వర్ గెలుపొందితేనే పార్లమెంట్‌లో బీసీల సమస్యలపై పోరాటం చేస్తారు.

– కుమ్మరి దర్శన్, బీసీ సెల్ నాయకుడు, షాబాద్ మండలం

బీసీలకు గళం వినిపించాలి

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతోకాలంగా కృషిచేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కే మా మద్దతు. బీసీల గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. కాంగ్రెస్ నాయకులు ఊసరవెల్లిలా రంగులు మారుస్తారే తప్ప న్యాయం చేయరు. బీసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసి సరైన న్యాయం చేసింది. కాసానిని గెలిపించుకుందాం.

– రాఘవేందర్ ముదిరాజ్, పులుమామిడి, నవాబుపేట మండలం

బీసీలను ఏకం చేసిన నాయకుడు కాసాని

రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కుతుంది. అలాంటి నాయకుడిని గుర్తించిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే. మన సత్తా చాటాల్సిందే.

– కారు చెన్నయ్య, బోడంపహాడ్, షాబాద్ మండలం

మా విలువ తెలిసేలా చేస్తాం

కాంగ్రెస్ పార్టీకి బీసీల బలమెంటో తెలిసేలా చేస్తాం. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ పార్టీ అవకాశం కల్పించడం మంచి విషయం. ఐకమత్యంతో జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి గెలిపించుకుంటాం. కాంగ్రెస్‌వాళ్లు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. కాంగ్రెస్ పార్టీ పతనం చూడటమే మా లక్ష్యం.

– కృష్ణయాదవ్, కృష్ణా కాలనీ అధ్యక్షుడు, మాదాపూర్

బీసీ అభ్యర్థికి మద్దతుగా నిలుస్తాం

కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలను చిన్నచూపు చూస్తే ఊరుకునేది లేదు. మా బలమేంటో అర్థమయ్యేలా చేసి చూపిస్తాం. బీసీ హక్కుల కోసం పాటుపడే నాయకుడు బీసీ అభ్యర్థి కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం. బడుగు బలహీన వర్గాలను అణగదొక్కేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను అడ్డుకుంటాం.

– రాంచందర్, ఇజ్జత్‌నగర్ వార్డు సభ్యులు, మాదాపూర్

జ్ఞానేశ్వర్ విజయానికి కృషి చేస్తాం

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నాయకుడు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజయానికి కృషి చేస్తాం. బీసీలకు దమ్ము, ధైర్యం ఉంటే కాసానిని గెలిపించుకోండి చూస్తాం అంటూ ఓ నాయకుడు సోషల్ మీడియాలో సవాల్ చేశాడు. ఈ విషయాన్ని బీసీలందరూ గమనించి బీసీ నేత కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని మన సత్తా చాటుదాం.

– ఎడ్ల ఉదయ్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు, కందుకూరు

బీసీల గళం వినిపిద్దాం

బీసీల గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. ఐక్యగా ఉండి ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉన్నది. కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి బీఆర్ఎస్ టికెట్ ఇచ్చి ఆ వర్గాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కాంగ్రెస్ వక్రబుద్ధికి సమయం చెప్పాల్సిన అవసరం ఉన్నది.

– జయమ్మ రాజు, శాలివాహన సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు

బీఆర్ఎస్‌ను గెలిపించుకుందాం

మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్



సమావేశం అనంతరం కార్యకర్తలు, నేతలతో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

దుండిగల్, ఏప్రిల్ 16: కరోనా వంటి కష్ట కాలంలో ప్రజలను పట్టించుకోని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఏం అభివృద్ధినందిస్తారని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి, గాజులరామారం డివిజన్(125) ఉషోదయకాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌తో కలిసి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని, గత 10 ఏండ్లల్లో ఎన్నడూ కనబడని వాటర్ ట్యాంకర్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి జోరుగా తిరుగుతూ ప్రజలకు నీటి కష్టాలను గుర్తు చేస్తున్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే నంబర్‌వన్ స్థాయికి ఎదిగిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఐటీ రంగంలో పెట్టుబడులు తేవడం, ఫ్లైఓవర్లు నిర్మించడంలో అభివృద్ధి పథంలోకి నడిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీజేపీ పార్టీకి ఓటు వేసినట్లేనని, అందరూ ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రచారంలో ప్రతి నాయకుడు ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ గెలుపు అవసరాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గత 20 ఏండ్లుగా పదవులు వచ్చినా, రాకున్నా ప్రజా క్షేత్రంలో ఉంటూ ఎన్నో వైద్య శిబిరాలు, సంక్షేమ కార్యక్రమాలు, ఉపాధి కల్పనతో ప్రజల్లో మమేకమైన నాయకుడు మన ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అని, ఇటువంటి నేతను ఎంపీగా గెలిపించుకుంటే అభివృద్ధి రెట్టింపు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

లబ్ధిదారు కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఏప్రిల్ 16: పేదలకు సీఎంఆర్ఎఫ్ సంపూర్ణ ఆర్థిక భరోసాను ఇస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. పేదరికం ఏ ఒక్కరి అనారోగ్యానికి శాపం కావొద్దన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. మాదాపూర్ డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీకి చెందిన రాధికకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.35,000 ఆర్థిక సాయం నిధుల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే గాంధీ మంగళవారం తన నివాసంలో బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి ఆర్థిక సాయంతో నిరుపేదలు సైతం కార్పొరేట్ దవాఖానలలో వైద్య సేవలను పొంది తమ అనారోగ్యాలను దూరం చేసుకుంటున్నారన్నారు. కొండంత ధైర్యాన్ని బాధితులకు అందిస్తూ సేవలందిస్తున్నదని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. నిరంతర సేవల ద్వారా అభాగ్యులను ఆదుకుంటూ నేనున్నానంటూ భరోసాను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంను సద్వినియోగం చేసుకుని ఎందరో పేదలు తమ అనారోగ్యాలను నయం చేసుకుని జీవనోపాధులతో కుటుంబంతో సంతోషంగా ఉంటున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సాంబశివరావు, అక్కారావు, రాములు, బుజ్జన్న, రామకృష్ణ, సత్యం, నర్సింహా, వెంకటేశ్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

– శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నదమ్ముళ్ల ప్రేమకు, తల్లిదండ్రుల గౌరవానికి, భార్య ప్రేమకు శ్రీరాముడు ఆదర్శప్రాయుడన్నారు. పెండ్లి వేడుకలు ఎలా జరగాలో సీతారాముల కల్యాణం చెబుతుందని, ఆ ఆదర్శ సీతారాముల దంపతులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోరారు. వాడవాడలా నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని, ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 16: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యాప్తంగా డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ విభాగం ఆధ్వర్యంలో జీడిమెట్ల డివిజన్ మోడిబిల్డర్ అపార్ట్‌మెంట్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇండ్లలో సిలిండర్లు ఒక్కోసారి గ్యాస్ లీకై మంటలు ఎగిసిపడిన సందర్భంలో మనం తీసుకోవాల్సిన నివారణ చర్యలను స్థానిక మహిళలకు కండ్లకు అద్దినట్లు వివరించారు. మంటలు ఎగిసిపడినప్పుడు ఆందోళన చెందకుండా నివారణ చర్యలు తీసుకునేందుకు ముందుకు రావాలని, ఆ తర్వాత 101 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇస్తే వెనువెంటనే అగ్నిమాపక శాఖ నుంచి మంటలను ఆర్పివేసేందుకు అక్కడ వాలిపోతామని వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారి వి.సుభాష్‌రెడ్డితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా..

మియాపూర్, ఏప్రిల్ 16: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్-1 సభ్యులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో నీసీ రోడ్లు, తాగునీటి సమస్యలను ఆయనకు విన్నవించారు. అనంతరం కార్పొరేటర్ దొడ్ల మాట్లాడుతూ.. కాలనీలో సమస్యలను పరిష్కరిస్తానని, పక్కా రహదారులు, తగినంత తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, వెంకటేశ్, సంపత్‌రెడ్డి, కృష్ణ, నర్సింగరావు, రఘు, రామ్‌రెడ్డి, సోమయ్య, నర్సింహ, మనోహర్‌రెడ్డి, వెంటకస్వామి, ఖదీర్ పాషా పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని కమలమ్మ కాలనీలో వీరాంజనేయ స్వామి, వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్టలో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి డీవీజీ ట్రస్టు ద్వారా రూ.21,000 విరాళంగా అందించారు. పాండు, రాజు పటేల్, కృష్ణారావు, మల్లేశ్, మురళీ, శంకర్, శంకర్ పాల్గొన్నారు.

ఆగివున్న టిప్పర్‌ను ఢీకొట్టి..

కొండాపూర్, ఏప్రిల్ 16 : బైక్‌పై వెళ్తూ.. ఆగివున్న టిప్పర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వట్టినాగులపల్లి నివాసి పత్తావత్ హమ్యా (31), తన బావ మరిది విస్తావత్ మోతీలాల్‌తో కలిసి సోమవారం అర్ధరాత్రి బైక్‌పై గోపన్‌పల్లిలోని జర్నలిస్ట్ కాలనీకి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఉన్న శ్రీదేవి ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో కంకర లోడ్‌తో ఆగివున్న టిప్పర్‌ను ఢీ కొట్టాడు. బైక్ డ్రైవింగ్ చేస్తున్న హమ్యా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మోతీలాల్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని దవాఖానకు తరలించారు. అతడి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మంజీరా పైప్‌లైన్ మరమ్మతు పనుల పరిశీలన

కాలనీలో మంజీరా పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు

మియాపూర్, ఏప్రిల్ 16 : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామనగర్, కృష్ణవేణి కాలనీలో చేపడుతున్న మంజీర పైప్‌లైన్ మరమ్మతు పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం నేపథ్యంలో తాగునీటి సమస్యలు లేకుండా అత్యంత పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. పైప్‌లైన్‌లు లీకేజీలు లేకుండా చూడాలని, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులను పూర్తి చేసి తాగునీటి సరఫరాలో ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది పైప్‌లైన్‌లపై నిరంతరం తగు పర్యవేక్షణ చేపట్టాలని, ఎటువంటి ఇబ్బందులున్నా వెంటనే ఉన్నతాధికారులకు నివేదించాలని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, కుమార్, ఉపేందర్, వెంకటేశ్, నరేందర్, ధనుంజయ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నలుగురికి రిమాండ్

జీడిమెట్ల, ఏప్రిల్16: దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను రిమాండ్‌కు పంపారు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్‌నగర్‌కు చెందిన షేక్‌దస్తగిరి(32)ఇండ్లలో ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తుంటాడు. అతడి నుంచి ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహన చోరీలు చేసే జగద్గిరిగుట్టకు చెందిన గందె శ్రీశివకుమార్ (34) నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అతను పలు స్టేషన్ల పరిధిలో జరిగిన 30కిపైగా చోరీ కేసుల్లో నిందితుడు. చోరీ కేసు నిందితుడైన రాంరెడ్డినగర్‌కు చెందిన పొన్న సాయిలు(34)నుంచి బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఎర్రగడ్డకు చెందిన ఎండీ అర్షద్(21) సనత్‌నగర్, జీడిమెట్ల పరిధిలోని నాలుగు చోరీ కేసుల్లో నిందితుడు. ఇతని నుంచి బైక్, ఫోన్‌తోపాటు రూ.11వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నలుగురిపై కేసులు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొండాపూర్, ఏప్రిల్ 16: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..లింగంపల్లి రైల్వే స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాం సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(45), మృతి చెంది ఉన్నట్లు అందిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, సదరు వ్యక్తి స్థానికంగా ప్లాస్టిక్ బాటిల్స్, కాగితాలను సేకరిస్తూ జీవనం సాగిస్తున్నట్లు నిర్ధారించారు. కాగా మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

కొండాపూర్, ఏప్రిల్ 16: వేసవి తాపం నుంచి ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియం వద్ద హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎండ తీవ్రత రోజు రోజుకు పెరిగిపోతుందని, ప్రజలు వీలైనంత అధికంగా తాగునీటిని సేవిస్తూ, ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. ఎండల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే తప్ప బయటకు రాకుండా ఉండాలన్నారు. వడ దెబ్బలతో తీవ్ర అనర్థాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీలైనంత ఎక్కువగా నీటిని తాగుతుండాలన్నారు.

ప్రతి ఉద్యమంలో ముందుండి నడిపించేది పాటే

సినీ, గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ

సమావేశంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

కొండాపూర్, ఏప్రిల్ 16 : ఉద్యమం ఏదైనా సరే మనిషిని ముందుండి నడిపించేది పాటేనని ప్రముఖ సినీ, గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. మానవ చరిత్రలో ఆదిమ కావ్యం పాటేనని, అది శ్రమ నుంచే పుట్టిందని ఉత్పత్తి ప్రక్రియలోనూ కాయకష్టంలోనూ పనితో పాటే పాట వర్ధిల్లిందని ఆయన వివరించారు. యూనివర్సిటీ ఆఫ్ గ్రాంట్స్ కమిషన్ మాళవీయ మిషన్ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం, కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్, కళాశాల విద్యా శాఖ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏపీలోని డిగ్రీ కళాశాలల తెలుగు అధ్యాపకులకు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం(సామర్థ్యాల నిర్మాణ కార్యక్రమం) ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యూజీసీ, మాళవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పది రోజులపాటు కొనసాగుతుంది. అధ్యాపకుల సహాయాచార్యులకు ఆచార్యులకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పెంపొందించడంలోనూ, పరిశోధన పద్ధతులను, ప్రమాణాలను రూపకల్పన చేయడంలోనూ కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.విజయకుమార్, తెలుగు శాఖ విభాగాధిపతి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత విరాట్ సాల్యూషన్స్

ఆర్‌పీఎల్ టోర్నమెంట్ విజేత విరాట్ సాల్యూషన్స్ టీం

కొండాపూర్, ఏప్రిల్ 16: నిత్యం కంప్యూటర్లతో కుస్తీ పట్టే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఆటవిడుపులో భాగంగా నిర్వహించిన ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మాదాపూర్‌లోని విరాట్ సాల్యూషన్స్ ఐటీ సంస్థ ఉద్యోగులు విజేతలుగా నిలిచారు. ఈ టోర్నమెంట్‌లో 22 ఐటీ సంస్థలకు చెందిన జట్లు పోటీలో పాల్గొనగా, ఫైనల్‌కు చేరిన విరాట్ సాల్యూషన్స్, ఎమోనిక్స్ వారియర్స్ జట్ల మధ్య సాగిన పోరులో విరాట్ సాల్యూషన్స్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన సంస్థ మేనేజర్ ఖాదర్ మాట్లాడుతూ... నిత్యం బిజిబిజీగా ఉండే ఉద్యోగులు ఇలాంటి క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనడంతో వారిలో నూతన ఉత్తేజం నిండుతుందన్నారు. పోటీల నిర్వాహకులతోపాటు విజేతగా నిలిచిన జట్టును ప్రత్యేకంగా అభినందించారు.

కూల్చి వేతలు

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మియాపూర్ విలేజ్‌లోని సర్వే నం.28తోపాటు గుట్టల బేగంపేట్ సర్వే నం.63లో పలు అక్రమ నిర్మాణాలను మండల రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలను చేపడితే కూల్చివేతలు తప్పవని ఆర్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

– మియాపూర్, ఏప్రిల్ 16